# ఈ మనిషి - ఈ లోకం

గోదావరి స్టేషను నాకు తెలియంది కాదు. మెయిలు బ్రిడ్జి దాటి రాజమండ్రిలో అడుగు పెట్టీ పెట్టగానే 'కూలి... కూలి...' అన్న కేకలు వినిపిస్తాయి. ఆ కేకలు 'ఆకలి... ఆకలి...' అన్నట్లు ఏవేవో ధ్వనుల్ని మనమస్తిష్కంలో ప్రకంపింప జేస్తాయి. దడదడగా మెయిలు ఆగిపోతుంది. దిగేవారిని దిగనివ్వకుండా, ఎక్కే వారిని ఎక్కనివ్వకుండా, జనం - తమను తామే మోసగించుకుంటారు. తమకు అక్కరలేని స్థలాలు ఇతరులకు దక్క కూడదనే కోరిక లేకపోయినా అందుకు నిష్కారణంగా అడ్డుపడుతూ ఉంటారు. తొందరకు, భయానికి బుర్ర ఉండదన్న నగ్న సత్యాల్ని ప్రదర్శిస్తారు.

ఈ రద్దీలో మా శివరావును చూడలేనేమో అన్న భయం వేసింది. భయం అంటే భయం కాదనుకోండి... అతను కనబడకపోతే వాళ్ళింటికి వెళ్లడానికి నామనసంత సంబరపడదు. కాని అతని ఇంటికి వెళ్లాలని ఈ హృదయం తపిస్తోంది. అతనితో కలిసి అతని ఇంటికి వెళ్లడానికి ఇబ్బంది పడని మనసు - ఎందుకు అతను లేకుండా ఒంటరిగా చుట్టం చూపుగా అతని ఇంటికి వెళ్లడానికి వెనుకంజ వేస్తుందో ఓ పట్టాన అర్థం కాదు. అతనికీ నాకూ ఉన్న పరిచయం కొత్తదికాదు. పాతదైనా మరుగున పడిపోలేదు. ఈ బాధలన్నీ పడలేక స్టేషనుకు వచ్చి కలుసుకోవలసిందని, ఓ కార్డు అతనికి వ్రాయనే వ్రాశాను. కాని అతన్ని పట్టుకోవడం ఎలా?

హిగిన్ బాదమ్స్ దగ్గర సాధారణంగా వాడికి నిలబడటం అలవాటు. ఆరుబయటే విచ్చల విడిగా పారవేయబడి ఉన్న పార్సిల్స్ మెల మెల్లగా దాటుకుంటూ మా వాడ్ని వెదుక్కుంటూ సామాన్లు తగిలి ముందుకు పడిపోకుండా నన్ను నేను కాపాడుకుంటూ స్టేషను నుంచి బయటపడ్డాను.

'బాబూ... బాబూ...' అని రిక్షావాళ్ళు నన్ను చుట్టుముట్టి నా సంచీ లాక్కున్నారు. నా సంచిని లాక్కుపోయిన రిక్షా వాలాను గుర్తు పట్టడానికైనా వీలులేని గడబిడలో

చిక్కుకు పోయిన నన్ను - 'రండి బాబూ అన్న ఆ రిక్షావాని' కేక నన్ను ఆశ్చర్య చకితుణ్ణి చేసింది. అతనిలోని నీతి... నన్నూ, నా భావాలను కెలికి విడిచింది. మా వాడు నన్ను స్టేషనులో వెదుకుతున్నాడేమో అన్న ఆందోళన నాలో సమసిపోలేదు గాని, ఆకలికీ అవినీతికీ సంబంధం లేదన్న సత్యం బయటపడి నన్ను సంతృప్తి పరచింది. ఎంతో ఆనందపరచింది.

గ్రాఫులోని గళ్లల్లా ఉన్న సందుల్లో రిక్షా, పడిపోయిన దుర్గంధ వృక్షాల్లాంటి కాలువల శక్తికి కంపించిపోతూ గమ్యస్థానం చేరుకోవడానికి కటకట లాడిపోతోంది. మా వాడి ఇంటికి నాకు దారి తెలుసు. నేను చెప్పిన మార్గంలో రిక్షా పోతూనే ఉంది. నా మనసు 'ఎన్నాళ్లకు మా వాడ్ని కలుసుకుంటున్నాను...!' అన్న ఊహల పాపాయికి, చిరునవ్వును గోరుముద్దలు చేసి అందిస్తూ ఏమిటేమిటో ఆనందిస్తోంది.

వాడు నన్ను ఎన్నిసార్లో రమ్మని వ్రాశాడు. కాని నేను ఒక్కసారి కూడా కదలి రాలేదు. దానికి అప్పట్లో అనేక కారణాలు అడ్డొచ్చాయి. తరువాత, తరువాత ఒకరికొకరం ఉత్తరాల కందకుండా అంతర్ధానమైపోయాం. ఎప్పుడూ విడిచి పెట్టి ఉండలేని మిత్రులం ఈనాడు ఆనవాలు పట్టలేని స్థితిలో కలుసుకోడానికి ప్రయత్నిస్తున్నాం. అందుకనే ఈ హృదయంలో ఏదో గడబిడ... ఏదో మాట్లాడాలి అన్న తపన... తీరా కలసిన తరువాత ఏమీ మాట్లాడలేక పోవొచ్చు! మాట్లాడుతూ, మాట్లాడుతూ... అతనిలో కలిగిన నాకు నచ్చని పరిణామాలు నేను సహించలేక అదోలా మాట్లాడవచ్చు! ఏమైనా వాడు నాకు మిత్రుడు. వాడి వెనుకటి గుణాలు నాకత్యంత ప్రీతి పాత్రమైనవి. ఈనాడు అతనిలో వచ్చిన మార్పు అందుకు భిన్నంగా ఉన్నా... నేను అతనిలో కలసిపోడానికి ఎందుకధైర్యపడాలి?

రిక్షా ఆసందు మలుపు తిరిగింది

అదే ఇల్లు

ఔను అదే

అదిగో

వాడే...

తెల్లనిచొక్కా... తెల్లని షరాయి. వేషం నిరాడంబరంగా ఎప్పటిలాగే ఉంది. మెట్లు దిగి నాలుగడుగులు ఆ దిశగా వేశాడు.

ముగ్గురు పిల్లలతో అతని సతీమణి ఆ గుమ్మంలో నిలబడి ఉంది. నా హృదయం పులకించింది. ముగ్గురు పిల్లల తరువాత కూడా ఆ సతీమణి భర్తను

గుమ్మం వరకు ఆ విధంగా సాగనంపడం నన్ను ముగ్ధుణ్ణి చేసింది.

నేను చప్పట్లు చరిచాను. వెంటనే వాడు వెనక్కు తిరిగాడు.

ఒత్తుగా పెరిగిన జుట్టు, కప్పల్లా పైకి తేలిన కళ్లల్లో ఎర్రని జీర నన్ను భయపెట్టాయి. నన్ను చూడగానే వాడు నవ్వలేదు. లేక నవ్వాడో... వాడు ఎంతో చక్కగా నవ్వగలడు. అందులో నన్ను చూసినప్పుడు వాడు నవ్వకుండా, సంతోషాన్ని ప్రకటించకుండా ఉండడం దుర్లభం!కాని అతనిలో ఆ ఛాయలు లేవు.

అప్పుడే వాడు, "రా... అలా పోదాం..." అంటూ నన్ను వాళ్ల ఇంటిలోనికి తీసుకొని వెళ్ళకుండా... అతను వెళ్తూన్న దిశగా నన్ను తీసుకొనిపోయాడు. నాకు ఎందుకనో వెనుదిరిగి ఆమెనోసారి చూడాలనిపిందించి కానీ వీలుపడలేదు. నేను నీరసపడి పోయాను. "బాబూ... డబ్బు"లంటూ రిక్షావాడు కేకవేయగా నేను వెనక్కి తిరిగాను కాని, అక్కడ ఆమె లేదు. రిక్షావాడికి డబ్బులిచ్చి, ఆ సంచిని ఆ ఇంట్లో పడవేయమని చెప్పి మేం ముందుకు సాగిపోయాం.

కొంత దూరం ఇద్దరమూ నడిచాం. నేను నాలో సుడిగుళ్ళు తిరుగుతున్నాను. ఇంతలో వాడు "మెయిల్లో... వచ్చావా...?" అన్నాడు. వట్టి పొడిమాట. నాకు బలేగా కోపమొచ్చింది, "నా ఉత్తరం అందలేదా...." అన్నా. అతని చేత అబద్ధా లాడించాలని లేకపోయినా అలా అనకుండా ఉండలేకపోయాను. కాని వాడు వెంటనే "అందింది" అన్నాడు. నా ముఖంలో నెత్తురు పిండివేయ బడింది. నాకేమి మాట్లాడటానికీ తోచలేదు. కాని "నువ్వు బాగా మారావు..." అన్నా. దీనికి సమాధానంగా వాడు "నా మీద నీకు కోపంగా ఉంది కదూ..." అన్నాడు. నాకు అదోలా అనిపించింది. "ఎందుకు కోపం" అన్నా... నీరసంగా.

సూటిగా వెంటనే వాడు, "నువ్వు అబద్ధాలాడటం ఎప్పటి నుంచి నేర్చు కున్నావ్.." అన్నాడు నా మీద అధికారిలా. ఆ స్వరంలో ఏదో కర్కశత్వం ధ్వనించింది. నేనేమీ మాట్లాడకూడదనుకున్నా. కాని, "అబద్ధాలాడనని నేను నీ ముందేమీ ప్రతిజ్ఞ పూనలేదుగా..." అన్నా. వెంటనే వాడు. అంత వరకు నా కళ్ళల్లోకి సూటిగా చూడని వాడు దీర్ఘంగా చూసి గట్టిగా నవ్వాడు.

భయంకరం!

అది నవ్వు కాదు. విషవాయువుల భాండం నా ముఖంమీద పగిలినట్లయింది. ఆ కళ్ళల్లో కృత్రిమాలు, దగాలు, దారుణహత్యా ప్రయత్నాలు కదులుతున్నాయి. ఆ పెదవుల మధ్య శబ్దజాలం రక్తదాహంతో కాని తృప్తి చెందనట్లు బిగువై పోతోంది. ఆ

దీర్ఘ నాసిక ఎవరివో ఉచ్ఛ్వాసనిశ్వాసాలు పీల్చివేయడానికి సిద్ధపడుతూన్నట్లు ముందుకురుకుతోంది. ఆ భయంకర నేత్రాలు సమస్త సౌందర్యాన్నీ చిందర వందర చేసివేయడానికి సిద్ధంగా ఉన్నట్లు విచ్చుకత్తుల సిపాయిల్లా అటూ ఇటూ తిరుగుతున్నాయి. ఒకసారి ఆ రెప్పలు అటూ ఇటూ కదిలాయి. జీవన్మరణాల మధ్య కొట్టుకుంటూన్న ప్రాణులను చూసి నవ్వుతున్నట్లు కనిపించాయి!

నేను నోరు తెరుచుకొని అలా ఉండిపోయాను. ముసలివాని తలమీది వెంట్రుకల్లా ఆకాశం అతన్ని చూసి పాలిపోయింది. దయతో తొణికిసలాడే ఆ నేత్రాలలో ఈ రాక్షసత్వం ఎక్కడనుంచి వచ్చింది? ఎలా వచ్చింది? నా కవగతం కాలేదు.

నా వేదన గ్రహించాడో లేక తన హృదయాన్ని విప్పి చెప్పాలని భావించాడో తెలియదు కాని, వాడు ఒక్కసారి నిశ్చల మనస్కుడై పోయినట్లు, నడుస్తూ నడుస్తూ ఉన్నవాడు మధ్యలో ఓ క్షణం నిలిచిపోయి, నా కళ్ళల్లోకి చూడకుండ ఆ తలను నావైపే త్రిప్పి "నా చేతినిండా ఇప్పుడు కావలసినంత డబ్బుందోయ్..." అన్నాడు.

నా తల పగిలిపోయింది. నా కాళ్ళు అతని అడుగులతో అడుగులు కలపడానికి హడలిపోయాయి. అతని వాలకం, ఆ చెప్పే విధానం, చూస్తూ ఉంటే నాకదేమిటో ఊపిరి సలపని, అసహ్యం వేసింది. వీడిలో ఇలాంటి మార్పు ఎలా వచ్చింది చెప్మా... అన్న ఆశ్చర్యం నా ముందు కాగడాలా మండింది.

అప్పుడే వాడు, "అశాంతిలో ఉన్న ఆనందం నీకేమైనా తెలుసా బ్రదర్" అన్నాడు.

నా ముఖం వేలబడిపోయింది. పిచ్చిగా అందని ఆకాశంలోకి చూశాను.

"నాకింతకు ముందు అర్థం కాలేదు. డబ్బు చేతిలో లేనంతకాలం నీతులు చెప్పడం ఎంత సులభమో... ఈ నాడు నాకర్థమైనట్లుగా మరెవ్వరికీ కాదు. డబ్బు కోసం ప్రతి మనిషి తాపత్రయపడతాడు. కాని పాపాలు చెయ్యడానికి పిరికితనం వహిస్తాడు. పిరికి వాడికి డబ్బు దక్కదు. పాపాలు చెయ్యడానికి ధైర్యం కావాలి. తెలివి కావాలి. తెలివీ, ధైర్యమూ ఒక్క పాపాత్ముల జన్మహక్కు బ్రదర్... అశాంతి ఎక్కడైతే ఉందో, అక్కడ ఆలోచన ఆకాశాన్ని చుంబిస్తుంది. ఎవడు పాపాలను చేస్తాడో వాడే అశాంతిని పొందగలుగుతాడు. వాడే అత్యంత ప్రతిభావంతంగా ఆలోచించ గలుగుతాడు. అలా ఆలోచించేప్పుడు ఎంత ఆనందంగా ఉంటుందో చెప్పు. అది కార్యరూపంలో పెట్టగలిగిననాడు ఇంకెంత ఆహ్లాదకరంగా ఉంటుందో ఎలా చెప్పగలం? అసలు నిజాయితీగా బ్రతకడమంటే అర్థమేమిటో తెలుసా... మనిషి తనకు ఏ మాత్రం జీవిత మనేది లేకుండా చేసుకోవడమేనోయ్..."

నా తల ముక్కలు ముక్కలై పోతోంది. కాని వాడన్న మాటలు, వాటి అంతరార్థాలు నా కర్థం కాలేదు.

"నేను నా జీవితాన్ని నిలుపుకుంటున్నాను బ్రదర్... నేనిప్పుడు సుఖంగా బ్రతుకుతున్నాను. నీవేమిటో అప్పుడు తెగచెప్పే వాడివి. ఇంతవెన్నెల్ని, ఈ నదీ సౌందర్యాన్ని విడిచి, ఈ రాజమండ్రి ప్రజ ఎలా ఈ కుళ్ళు కొంపల్లో కునుకుతోందో... అనే వాడివి. ఈ నది ఒడ్డున, ఆ వెన్నెల తళ తళల్ని చూస్తూ ఎప్పుడో ప్రాణాలు విడిచెయ్యాలని ఎంతో ఎంతో ఆశించే వాడివి. కాని ఇప్పుడేం చేస్తున్నావు? ఓ చిన్న పిల్లకాలువైనా లేని ఊళ్లో పాదమంత ఓ పాత డొక్కు కొంపలో... ఈసురోమని బతుకుతూ, ఆ కొంపలోనే ఎలాగైనా బతక గలిగితే చాలు అని ఆ ఆఫీసు అత్తగారికి కోడలివైపోయావు. నీ జీవితానికి కొత్తలేదు. మారని పోలికల్లా మారని రోజులను పట్టుకొని మారకుండా బతుకుతావు..." అన్నాడు.

ఈ మాటలతో నేను కొంత తేరుకున్నాను. తన ఆధిక్యతను నిరూపించుకోవడానికి, వాడు ఆరాటపడుతున్నాడు. వాడు ఏ విధంగా డబ్బు సంపాదించాడో... నాకు తెలియదు. కాని ఈ విషయం ఈ లోకానికంతటికీ తెలిసి ఉంటుంది. లోకానికంతటికీ తెలిసిన విషయం నాకూ తెలిసి ఉంటుందని పాపం వాడు పొరపాటు అంచనావేసి ఉంటాడు. ఈ ధోరణికి అదే మూలకారణ మనుకున్నా.

పాపం వాడు తన మాటలలో కూరుకపోయాడు. నన్ను పూర్తిగా విస్మరించాడు. తను చూసే వ్యక్తులందరి వలెనే నన్నూ భావించి ఉంటాడు. ఎటొచ్చీ నా దగ్గర ఇంకొంత చనువు తీసుకున్నాడు. అతని స్నేహమనే ధనాన్ని అప్పుగా పుచ్చుకున్న పాపానికి ఈ నాడు ఈ నట్టనడి వీధిలో అతని ఋణానికి చెల్లుబెట్టలేని నిస్సహాయ స్థితిలో దీనంగా నిలబడి ఉన్నానని పసిగట్టి ఉంటాడు. మాటకారితనం లేని పేదరికంతో, సిగ్గనే చింకి గుడ్డలతో నోరు మెదపలేని నా అభిప్రాయాల అమాయకతల ఘోరదారిద్ర్యం పుందీనావస్థలో కృశించి కృశించి ఉన్నానని అంచనా వేసి ఉంటాడు. కనీసం ఊహల మిత్రులను వేడుకొని, అతని అప్పును అణాపైసలతో తీర్చిపారేసి శ్రీరామ చుట్టగలతాహతు లేని శక్తి హీనుణ్ణని గ్రహించి ఉంటాడు!

"డబ్బు సంపాదించాలి బ్రదర్... నేను ఏమిటో చెపుతున్నానని కాదు. నా బాధలు నీకు తెలియనివి కావు. నేను డబ్బులేక ఎన్ని ఇక్కట్లు పడ్డానో... నా మిత్రులు, నా బంధువులు, ఇంతెందుకు నా భార్య... నన్నెన్ని విధాల హింసించారో నీకు తెలియకపోలేదు. కాని ఈ నాడు ఎంత మంది నేను దూరంగా ఉండాలనుకుంటున్నా

నా చుట్టూ తిరగాలని ఉబలాటపడుతున్నారో... బంధువులు నన్ను మర్యాద చేయడానికి ఈ నాడు అవకాశాల కోసం ఎట్లా ఎదురు చూస్తున్నారో వాటిని ఎట్లా కృత్రిమంగా కల్పించుకొని నన్ను పాముకొని తిరగడానికి ఇచ్చగిస్తున్నారో నీకు తెలియదు బ్రదర్..." అన్నాడు.

అప్పుడే ఓ కుర్రాడు మా దగ్గరకొచ్చి, "నమస్కారమండి శివరావుగారూ" అన్నాడు.

వెంటనే మా శివం, "నువ్వటోయ్... మీ వాడికి చెప్పానోయ్... దొంగ ముండా కొడుకులే... ఓ పట్టాన విన్నాడు కాదు. నాకు బలేగా మండుకపోయింది. 'బంగారం లాంటి కుర్రాడు... వాడింకో చోటికి పోయే వరకు ఇలాగే ఏడుస్తావు... పోయింతరువాత నీ మాట విన్నాను కాను అని అఘోరిస్తావు. అంత డబ్బు అలా వచ్చి పడుతూంటే ఓ పది రూపాయలు పెంచడానికి అలా చచ్చిపోతావేం...' అన్నా. దానితో ముఖం ఆముదం తాగిన వాడిలా పెట్టి మాట్లాడకుండా ఊరుకున్నాడు. అలా ముఖం పెట్టి, మాట్లాడకుండా ఊరుకోవడం అంటే - మనం చెప్పినదానికి అయిష్టంతో అంగీకరించడమన్న మాట! ఫరవాలేదు; మెత్తబడ్డాడనుకున్నా. మనకు డబ్బు పెరగాలి కాని, వాడికి ఇష్టం లేకపోతే మాత్రం మనకు పోయిందేముంది? మెల్లిగా దగ్గరకు పిలిచాను. నీకింకా తెలియదేమో... మీ పోటీదారు ఆ అబ్బాయిని తన కొట్టులోకి రమ్మని ఏకగోల పెడుతున్నాడు. అతను వెళ్లిపోయాడంటే నీ కెంత నష్టమో, నీకేమీ తెలియకుండా ఉంది. నేనా కుర్రాడికి గట్టిగా చెప్పాలే... పిచ్చోడా... మా వాడు మంచివాడు. నీ జీతం హెచ్చిస్తాడులే. కొంపతీసి తప్పటడుగు వేశావు గాక... రెంటికీ చెడ్డ రేవడవౌతావు. ఆ వెధవ నిన్నెన్నాళ్ళుపయోగించుకోవాలో అన్నాళ్ళూ ఉపయోగించుకొని, ఆ తరువాత బయటికి తగలెయ్యగలడు అనేప్పటికి మీ షావుకారు చల్లబడ్డాడోయ్. ఏదో కుర్రాడు.. అందులో కుటుంబం పెద్దది. పాపం చాలా ఇబ్బంది పడుతున్నాడు. వేణ్ణీళ్ళకు చన్నీళ్ళగా నీవు కాస్త తోడుపడాలి అన్నా. దీనితో మీ వాడికి 'సరే' అనక తప్పలేదోయ్. చూశావా మన తడాఖా..." అని అతని వైపు సుతారంగా చూసి సన్నగా మీసం మెలివేస్తున్నట్లు నవ్వాడు.

ఆ అబ్బాయి "మీ మేలు మరచిపోలేనండి" అని ఒకటికి పదిసార్లు నమస్కరించి అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

అక్కడ నుంచి ఆ అబ్బాయి ఇలా వెళ్ళాడో లేదో మా వాడు వికటంగా, నీచంగా నవ్వి, "ఈ వెధవకి జీతం పెరగాలట! మనిషి కొంత ఎత్తు ఎదిగి ఆగిపోయినట్లు ఈ

జీతాల పెరుగుదల కూడ ఆగిపోతోందికాని లేకపోతే ఇంకేమైనా ఉందా... ఆ షావుకారు వీడ్ని ఊడపీకేస్తే మళ్ళీ దమ్మిడీకి మారడు. అయినా జీతం పెంచుతావా... మానేసేదా అని నీలుగుతాడు. చూశావా బ్రదర్ ఎలా ఉందో... అయినా వీడివల్ల మనకుపయోగం ఉంటుందని ఓ చక్కని ఊహ తట్టేప్పటికి సరే వీడికి ఈ మాత్రపు మేలు చేయడం అనవసరం కాదనిపించింది. దీనితో ఆ షావుకారు దివాళా తీయడానికి కావలసిన మార్గం వేసేశామన్న మాట" అంటూ పకపకా నవ్వాడు.

నేను మూగవాణ్ణయి పోయాను. నా నడక వెనుకబడిపోతోంది. నా తలలో చేయి పెట్టి నా జీవనాడులను ఎవరో వేళ్ళతో పీకుతున్నట్లయింది.

అప్పుడే ఓ లావుపాటాయన, "ఏమండోయ్... శివరావుగారూ... మమ్మల్ని పూర్తిగా మరచిపోయారు. అయినా మేం ఇప్పుడెందుకు కనిపిస్తాం లెండి" అన్నాడు.

వెంటనే మా వాడు, "ఏదోయ్ సత్యం, ఎక్కడా తీరుబడి చచ్చి ఏడవడం లేదు. అయినా ఓ సారి మా కొట్టు వైపు వస్తే ఏం పోయింది. అంతేలే నువ్వు మా దగ్గరకెందుకొస్తావ్... మా అవసరం తీరిపోయిందిగా..." అన్నాడు.

వెంటనే అతను పకపకా నవ్వి, "ఎలాగైనా అఖండుడివి. నా మాటలే నాకు తిప్పి అప్పజెప్పేస్తావ్... అది సరేగాని, నాకిప్పుడు అర్జంటుగా ఓ పది టన్నుల కిటికీ ఊచ కావాలోయ్. నువ్వు కాదంటే కుదరదు. ఎలాగో సంపాదించి పెట్టాలి" అన్నాడు.

శివం తమాషాగా వెక్కిరింతగా నవ్వి, "అదా సంగతిబాబూ.. దయచెయ్... దయచెయ్..." అన్నాడు.

పాపం ఆ బట్టతల పెద్ద మనిషి "ఇది నీ వల్లే అవుతుందోయ్... నువ్వు నమ్ముతావో నమ్మవో కాని, ఇప్పుడు నేను నీ కోసమే బయలుదేరాను. వెదకబోయిన తీగ కాలికి తగిలినట్లు తగిలావు" అని బ్రతిమాలే ముఖాన్ని - మా వాడిముందు కారు హారన్ విన్నా కదలని గొడ్డులా నిలబెట్టాడు.

శివం కొరడా దెబ్బలు కొట్టి అదలించినట్లు నవ్వి, "నీ నాటకాలు నా దగ్గర కాదు. తిన్నగా వచ్చిన దారి పట్టు. లేకపోతే ఏ దారికి పోవాలనుకున్నావో, ఆ దారికి తగలడు..." అన్నాడు. ఆ భాష కర్ణకఠోరంగా ఉంది. అయితే అది వాళ్లకు మామూలే కాబోలు!

అంతే. ఆ పెద్ద మనిషిలో విపరీతమైన మార్పు వచ్చేసింది. అతను పూర్తిగా దిగజారి పోయి "అది కాదు బ్రదర్... నీ ఇష్టమొచ్చిన రేటుకు సెటిల్ చెయ్యి. చాలా అవసరమొచ్చింది" అన్నాడు.

శివం ఊరుకోలేదు.

"ఏడిశావు పోదూ... అవసరానికి అరికాళ్ళుచ్చుకుని అవసరం తీరేక ముఖం చాటేసే మహానుభావుడివి కదూ... దయచెయ్... దయచెయ్..." అన్నాడు.

అయినా ఆ పెద్ద మనిషి కదల్లేదు. ఇలాంటి అవమానాల కల్తీనూనెల్ని... డబ్బుకు కక్కుర్తిపడి మర్దించుకోవడం వల్ల అందమైన శిరోజాల వంటి సుందరమైన మనసును రాల్చేసుకున్న ఆ బట్ట బుర్ర... "నీకెంత వేళాకోళమై పోయాను. అయితే కుదరదంటావ్... సరే..." అన్నాడు.

ఈ మాటల్లో ఏముందో గాని మా శివం తగ్గిపోయి. "సరే ప్రయత్నిస్తాలే... నేను తెచ్చిన రేటుకు ఒప్పుకుంటావా... మాట ఖరారేనా...?" అన్నాడు.

వెంటనే అతను. "ఒట్టు శివం. కాని మరీ అంత పెట్టెయ్యకు. మన పరిస్థితి ఈ మధ్య ఏమంత బాగులేదు" అన్నాడు.

శివం ఈ చివరి మాట విన్న మీదట సన్నగా అనుమతి పత్రంలా నవ్వి "అలాగే... అలాగే..." అని, లోలోన ఏమిటో గొణుక్కున్నాడు. అంతలోనే అతని కళ్ళు విచిత్రంగా మెరిశాయి. నిజంగా అవి చూసి తీరవలసిందే!

నాకు మతిపోతోంది. ఎలాంటి శివం ఎలా మారిపోయాడు అనుకున్నా. ఇంతలో శివం ఓ ఇంటి గుమ్మమెక్కాడు.

ఆ మెట్లు ఎక్కుతూ ఎక్కుతూ "ఇంటి ముందుకు వచ్చిన నిన్ను ఇంట్లోకైనా తీసుకెళ్ళకుండా వీధులంట ఈ తిప్పడమేమిటని అనుకుంటున్నావు కదూ..." అని, "చాల అవసరమైన పనోయ్... ఓ క్షణంలో వచ్చేస్తాను. కాస్సేపు నిలబడతావూ..." అన్నాడు. ఇంతలోనే మళ్ళీ ఏమనుకున్నాడో "ఫరవాలేదు రావోయ్..." అని ఏమిటోతన గుండెల్లోకి మ్రింగుతూన్నట్లు మారిపోయాడు. ఇన్ని విషయాలు తెలిసినవాడికి ఈ విషయం తెలిస్తే ఏంపోయింది అన్నట్లుగా అతని కళ్ళు అతివిచిత్రంగా మెత్తబడిపోయాయి.

ఆ ఇంట్లో మొదట ఎవరూ కనిపించలేదు. "సుందరం..." అని శివం గట్టిగా పిలిచాడు. సుమారు ఆరడుగులు ఎత్తున్న అందమైన బలిష్టమైన మానవుడొకడు పెదవి మీది సిగరెట్టు జారి కిందపడకుండా, "గుడ్‌మార్నింగ్... గుడ్ మార్నింగ్..." అని సిగరెట్టును వ్రేళ్ళ సందుల్లో బంధించాడు. ఇతరుల జీవితాలను అలా తమాషాగా ఇరికించుకొని కాల్చేయడంలో ఉన్న సుందరమైన ఆనందాన్ని అతని ముఖం ప్రకటిస్తోంది. ఒక్కసారిగా అతని కళ్ళు ఆ సంతోషంతో ప్రజ్వరిల్లి జిగేల్‌మని

మెరిశాయి. వెంటనే మా శివం ఆ వెలుతురులోని భావాన్ని పసిగట్టినట్లు, "ఇతను నా చిన్న నాటి మిత్రుడులే. ఊరకనే చూసిపోదామని వచ్చాడు. అయితే ఇంతకీ వాడేమన్నాడు?" అన్నాడు.

ఆ సుందరం ఒక్కసారి నిరుత్సాహపడిపోయినట్లు దీర్ఘంగా నిట్టూర్చి, "వాడు రోగ్ రోయ్. వాడికి తాగుడు ముండలు అన్ని వ్యసనాలూ ఉన్నాయి" అంటూ చిన్నగా నవ్వాడు. ఆ నవ్వు ఏదో ఆడవాళ్ళకు సంబంధించిన నవ్వులా ఉంది. మా శివం "సరే..." అన్నాడు. దానికర్థం నాకవగతం కాలేదు.

కాని నా శరీరం చల్లబడింది. నాలో జుగుప్స ఝుమ్మున ముసిరింది.

"సరే నేను సాయంకాలం కనిపిస్తా" అంటూ శివం వీధిలోకి వచ్చేశాడు. ఆ సుందరం నాకు అతి వినయంగా నమస్కరించి, నా దగ్గర సెలవు తీసుకున్నాడు. అంత పెరసనాల్టీ ఉన్నవాడు, నా ముందు అట్లా దిగజారిపోయి, తనను మరోలా భావించవద్దని నమస్కరించినట్లే ఉన్న ఆ మేడిపండు ముఖంలోని భావాన్ని గుర్తించగలిగాను.

ఇక మా వాడి ఇంటికి వెళ్ళకుండా ఊరికి ఎలా దారిపట్టాలా అని ఊహిస్తూ అతన్ని బాధగా అనుసరిస్తున్నా. మా వాడు రిక్షా మాట్లాడి, అందులో నన్ను కూలబడేశాడు. నా అవస్థ గమనించాడు కాబోలు "బ్రదర్... మీ సిస్టర్‌కు నువ్వంటే ఎంత ప్రేమనుకున్నావ్... నీ గురించి నా దగ్గర ఎన్నిసార్లో చెప్పింది. నీ కెంతో సిగ్గట. నువ్వెంతో మంచివాడవట. ఇవన్నీ ఎలా తెలిశాయని అడగవేం... మా పెళ్ళి కొత్తలో ఏమిటో నీ గురించి చెప్పానట. అప్పటినుంచీ నీ లాంటి వాళ్ళు చాలా అరుదుగా ఉంటారని ఏమిటేమిటో అంటుంది. నా మీద ఎప్పుడలిగినా నీ గురించే చెప్తుంది. నువ్వు నమ్ము, నమ్మకపో... మా దెబ్బలాటల గురించి నీకప్పుడు వ్రాస్తుండేవాడిని. అయితే ఇప్పుడు బాగా మారిపోయిందిలే. మునుపటిలా కాదు. ఇప్పుడు పల్లెత్తుమాట అనదు. అసలు ఆడవాళ్ళ కోపాలు మాయమయ్యేందుకు అర్ధణాపూలు చాలు. ఈ చిన్న కిటుకు తెలియక చీరలు తెచ్చిపడేస్తాం. నగలు చేయించిపారేస్తాం. నేను అవీ ఇవీ కూడ చేస్తూ ఉంటాను. అంచాత ఆవిడగారు తనకోపాలకు తాపాలకు నేనివ్వతేలిన బాకీ యావత్తూ ఎప్పుడో కొట్టిపారేసింది. నేను అప్పుడప్పుడు ఆమెను కొట్టిన మాట వాస్తవమే! ఈ విషయం నీకు తెలుసు. కాని అలా ఆడవాళ్ళను కొట్టడమంత బుద్ధి తక్కువ పని మరొకటి లేదు బ్రదర్... ఆ మాటకొస్తే ఈ లోకంలో ఎవరినీ కొట్టగూడదు. మాటల చాతుర్యంతో మనిషిని ఆటలాడించెయ్యాలోయ్.

మనిషిని ఏడిపించడానికీ, నవ్వించడానికీ మాటలకున్న బలం దేనికుంది? ఇది తెలియని బుద్ధి తక్కువవాళ్ళు చేయిచేసుకుంటారు. నేను చేయిచేసుకున్నంత కాలం నాకు లోకజ్ఞానం లేదని ఇప్పుడొప్పుకో వలసి వస్తోంది. ఒక రహస్యం చెప్తాను వినూ... ఆడవాళ్ళు మగవాళ్ళను ప్రేమించడమనే పొరపాటు ఎప్పుడూ చేస్తూ ఉంటారు. ఈ విషయం వాళ్ళకు తెలియదు.వాళ్ళకు శిక్షపడుతూన్నది ఇందుకైనా... వాళ్ళిదేమీ అర్థం చేసుకోరు. దీనికి మనమేం చేయగలం? మనం నిజమే చెప్పేస్తాం. నువ్వు నాకిష్టం లేదు తల్లీ... నీకో నమస్కారం, దయచెయ్యి - అని. వాళ్ళు దీన్నేమనుకుంటారో తెలుసా? మనల్ని పరస్త్రీలు వాంఛిస్తున్నారని, మనం నిజంగా ఎంతో మంచి వాళ్లమని... నిక్కచ్చిగా నిర్ణయించేసుకుంటారు. అందుకనే వాళ్ళు అమాయకులంటాను. అమాయకులకు మోసగించబడటమంటే ఎంతో ఇష్టం. అసలు వాళ్ళకు అమాయికంగా ఉండడం తప్పించి ఇంకేమీ చాతగాదు. మోసగించబడటం వల్లనే వాళ్ళు నిజానికి ప్రజల నోళ్ళల్లో పడుతున్నారు. ఈ వెర్రి ప్రజలు వాళ్ళను, 'ఎంత మంచి వాళ్ళు... ఎంత అమాయకులు' అనేస్తారు. ఈ మాటలంటే ఆ అమాయకులకు ఎంతో ఇష్టం. ఇంచాతనే నేను ఏమంటానంటే ఇటువంటి వాళ్ళను తృప్తి పరచడానికైనా చెడ్డవాళ్ళు తప్పనిసరిగా ఉండవలసి వస్తోందని. నా మట్టుకు నేను ఎన్ని చెడ్డ పనులు చేశానో లెక్కలేదు. అసలు లెక్కలేక పోవడం గొప్పకానేకాదు. అలాంటివి ఈ ప్రజ సహించడంలోనే ఉంది గొప్ప అంటాను! నిజానికి వాళ్ళల్లోనూ నాకున్నన్ని దురుద్దేశాలే ఉంటాయి. కాని వాళ్ళు వాటిని ఆచరణలో పెట్టలేరు. నేను వాటిని సునాయాసంగా చేసెయ్యగలను. అలాంటప్పుడు వాళ్ళేమనుకుంటారో తెలుసా... పోనిస్తూ... అప్పుడప్పుడు అలాంటి పనులు మనమూ చిన్న ఎత్తులో చేస్తూ ఉంటాము. అంతకన్నా దారుణంగా ఎప్పుడూ ఊహిస్తూనే ఉంటాం. చెయ్యడం ఎంత తప్పో మరి ఊహించడమూ అంతే తప్పు... అనుకొని పోనిస్తూ వాడెలా పోతే మనకేం... అని క్షమించేస్తారు. ఇదేనోయ్ ఈ ప్రజల బలహీనత! ఇంకొకటేమిటంటే ఈ ప్రజలు ఛస్తే ఎప్పుడూ మంచివాళ్ళు కాలేరు. అంచాత అంతవరకు మనదే రాజ్యం. అసలు కోటికొక్కడు లేని మంచివాడికోసం మనకెందుకు తాపత్రయం... నిజానికి మంచివాడంటే ఎవడో తెలుసా... వర్థి కోపిష్ఠి... తెలివి తక్కువ దద్దమ్మ... ముందు చూపు లేనివాడు. ప్రపంచాన్ని చూడనివాడు,ఒంటరిగాడు. అతన్ని అనుసరించే వారిని చూసి సహించలేనివాడు. తనమాటపైన ఉండాలని మొండి పట్టుదలగలవాడు. గర్విష్ఠి.. తను దేవునితో సమానమని సంతోషించేవాడు. విర్రవీగేవాడు. బహుశా యివి అయి ఉండవచ్చు! ఇలాంటి మంచివాళ్ళను గురించి నేను ఎక్కువగా బుర్రపాడుచేసుకోను. నేను పాడు చేసుకునేదల్లా మాలాంటి వాళ్ళే కొంత మంది

ఉంటారు. వాళ్ళంటే నాకు భయం. వాళ్ళతో పోటీ పడటం బహు కష్టం'' అని ఆగిపోయాడు.

నేను ఆశ్చర్యపోయాను. శివం జీవితంలో ఏదో అద్భుత శక్తి కదలుతోంది. అతను నిజంగా అసామాన్య వ్యక్తి. అతను ఎన్ని పాపపు పనులు చేసినా భయపడడు. భయం అతనిలో తొంగిచూడటమన్నది కలలోని వార్త. అతను మృత్యువును తీయగా ఆహ్వానించగలడు. అంతకన్నా దారుణమైన అవమానాలను ఒక్క ఈసడింపుతో తుడిచి పారవేయగలడు. మనమంతా 'రాక్షసుడా' అని తిట్టినా అతను దానికి కించిత్తూ చలించక పైపెచ్చు నిండు హృదయంతో గర్వించగలడు. ఇక అతన్ని ఏ పాపమంటుతుంది? అతన్ని ఏ శక్తి అణచివేయ గలుగుతుంది? అబ్బ! అతను జినుడు... దేనికీ లొంగడు!

రిక్షా ఇంటికి వచ్చేసింది. ఇటు వంటి వానిదగ్గర పాప మా ఇల్లాలు ఎలా బతక గలుగుతోందా అన్న సంశయం నన్ను పీడించ మొదలు పెట్టింది. ఇందాక నేను ఈ ఇంటికి వచ్చినప్పుడు ఆమె వీధిలో భర్తను సాగనంపుతూన్న విధానం నా కళ్ల ముందు అతి విషాదంగా మెదిలింది. ఆమె సహనానికి చేతులెత్తి నమస్కరించా లనిపించింది. వెంటనే నా దృష్టి ఆ గుమ్మం వైపు పరుగులు పెట్టింది. చిత్రం! ఆ ఇంటికి తాళం వేయబడి ఉంది. ఆమె ఏదైనా పేరంటానికి వెళ్ళిందేమో అనుకున్నా. కాని...

ప్రక్క ఇంటిలోని ఓ ముసలమ్మ అప్పుడే తాళం చెవులతో రుసరుసలాడుతూ వచ్చి శివాన్ని అతి నీచంగా చూస్తూ... "ఎందుకు నాయనా ఆ పిల్లనలా ఏడిపిస్తావు. పట్టపగలు కూడ నీకు ఉంపుడు కత్తెలు కావలసి వచ్చారా... మీ కృష్ణుడు టెలిగ్రాం పుచ్చుకొని మా కొట్టుకు రాకపోతే ఈ విషయం తెలిసేదే కాదు. అయినా ఇలాంటివి ఎన్నాళ్ళు దాగుతాయి? ఆ పిల్ల గంగిగోవు లాంటిది కాబట్టి ఇన్నాళ్ళూ సహించింది. అత్తగారక్కడ చావు బతుకుల మీద ఉంటే నువ్వు సాని ఇంటి దగ్గర కులకడానికి వెళ్లావా నాయనా... అక్కడ కనిపిస్తావేమోనని మీ జాయింటుదారు మనిషిని పంపకపోతే ఇప్పటికీ వచ్చేవాడివి కావేమో... ఇంత మంది పిల్లల్ని పెట్టుకొని నీకివేం బుద్ధులు బాబూ'' అంది.

నేను కొయ్యబారిపోయాను.

శివం మాత్రం తమాషాగా నవ్వి, "మామ్మగారూ... మీరు బలే వారండి. ఆవిడ గారికి మతిలేకపోతే మీరైనా బుద్ధి చెప్పొద్దండీ... మా జాయింటు దారుగాడికి ఏ మాట ఎప్పుడు మాట్లాడాలో ఎప్పుడు వేళాకోళమాడాలోకూడా తెలియదు. ఆ వెధవ ఏమిటో సరదాకి అన్నాడేమో. చావు బతుకుల మీద ఉన్నది ఓ ముసలమ్మే కదాఅని ఆ వెధవ నోటికొచ్చినట్లు వాగిఉంటాడు. నేను వీరితో వెళ్ళినట్లు మీ మనవరాలికి తెలియనే

తెలుసు. కాని ఎంత మూర్ఖంగా వెళ్ళిపోయింది! నేను మాత్రం రాసూ... ఇలాగే ఉంటాయ్ పిచ్చి పనులని... సరేలెండి మామ్మగారు. మీరు కూడ ఆ వెర్రిది చెప్పిందల్లా నమ్మేశారే గాని కాస్త మందలించాలనైనా తోచింది కాదు. సరేలెండి. ఏం చేస్తాం. ఔను గాని మామ్మగారూ... మీరు పొద్దుట ఓ అయిదు రూపాయలడిగారని చెప్పింది. అప్పుడు ఇద్దామంటే పర్సులో లేకుండాపోయాయి. ఇవిగో తీసుకోండి" అన్నాడు. అంతే ఆ ముసలమ్మ ఆ డబ్బు చల్లగా అంధుకొని, "నాకు తోచింది కాదు నాయనా... అయినా స్నేహితుడితో వెళ్ళినట్లు తను చూసింది కదా... అంత తొందర పడిందెందుకో... పిచ్చిపిల్ల. మా ఆడవాళ్ళ గుణం ఇదే బాబూ... వట్టి తొందర. ఈ తొందరలో మా సుఖాలనేకాదు మీ సుఖాలనూ పాడుచేస్తాం... ఎంత తప్పు పని చేసింది..." అంది.

ఈ విషయంలో శివం నన్నుకూడా ఉపయోగించుకున్నాడు. అందుకు నేను ఆశ్చర్యపడలేదు. కాని అంత చప్పున అతను ఆ ముసలమ్మ గుణానికి తగ్గట్టుగా మాట్లాడిన విధానం,ఆమెను తనవైపు త్రిప్పుకోవడంలో చూపిన చాకచక్యం నన్ను ఎక్కడెక్కడికో తీసుకొనిపోయాయి.

ఆవేళ మేం విడిపోతూండగా శివం ఒక్కటే మాట చెప్పాడు. అది ఎంత విచిత్రంగా ఉంది!

"ఇదిగో బ్రదర్... ఈ ఆడవాళ్ళున్నారే... మనమంతా భయపడే చావును గురించి వెరువరోయ్. కానుపు వచ్చినప్పుడల్లా దాని రుచి వారు తెలుసుకుంటారు. దీనితో వారికి చావంటే అతి చులకన! అంత భయంకరమైన చావే వారికి చులకనైనప్పుడు మిగిలిన కష్టాలు వారికో లెక్కలోవి కావు. అంచాతే ఆడవాళ్ళు దేన్నయినా ఎలాంటి కష్టాన్నయినా సహించగలరు" అన్నాడు.

ఈ మాటలు అతను దేనికి చెపుతున్నాడో ఎందుకు చెపుతున్నాడో నేను అర్థం చేసుకున్నాను.

అతని భార్య అతని దగ్గరకు తిరిగి వచ్చేస్తుందని అతను పూర్తిగా విశ్వసించాడు. కాని అలా జరగలేదు. వారం రోజులు తిరక్కమునుపే వార్తాపత్రికల్లో ఆమె ఆత్మహత్య చేసుకున్నదన్న వార్త నేను చూశాను. అంతే... నా కళ్ళల్లో నీటి బిందువులు నిలిచి భూమిపై రాలకుండా ఇంకిపోయాయి.

కాని శివం ఆ తర్వాత బైరాగుల్లో కలిసిపోయాడన్న చిత్రమైన వార్త విన్నాను. ఎంతమట్టుకు నిజమో?

(నవోదయ, 15-11-1959)